క్లుప్తంగా

పట్టణ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలి



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న కమిషనర్, సిబ్బంది

హుజూరాబాద్: పట్టణ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలని, స్వచ్ఛ హుజూరాబాద్ లక్ష్యంగా కలిసిరావాలని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య పట్టణ ప్రజలను కోరారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా శనివారం 22వ వార్డులో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. సిబ్బందితో కలిసి రోడ్డుకిరువైపులున్న పిచ్చిమొక్కలను తొలిగించారు. మేనేజర్ ఆర్.భూపాల్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్.సుధాకర్, సీనియర్ సహాయకుడు జె.శ్రీకాంత్, జూనియర్ సహాయకుడు రవీందర్, వార్డు అధికారులు, శానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సర్వే



సాక్షి స్పందన

ఇల్లందకుంట: మండలంలోని పెద్ద చెరువు కింద 200 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కొందరు జేసీబీలతో మట్టిని తరలిస్తూ శిఖం భూమిని పొలాలుగా మారుస్తున్నారు. సగం చెరువు కబ్జాకు గురవడంతో ఒక్క పంట పండించుకోలేని పరిస్థితి నెలకొందని జూన్ 27న సాక్షిలో ప్రచురితమైన కథనానికి శనివారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఇప్పటివరకు శిఖం భూమిని ఆక్రమించుకున్న ఆరుగురిని గుర్తించామని మండల ఇరిగేషన్ ఏఈ నవీన్ తెలిపారు. సర్వే కొనసాగుతుందని, ఎంతవరకు ఆక్రమణకు గురైందనేది తెలిసేందుకు మరికొంత సమయం పడుతుందన్నారు. ఆర్ఐ నాగరాజు, సర్వేయర్ మనోజ్‌రావు, లస్కర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మానకొండూర్ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు విద్యారంగ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ శనివారం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ముందుగా కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మండల అధ్యక్షుడు సాగర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కళాశాలలో కనీస వసతులు కల్పించాలని, గోడను నిర్మించాలని, కళాశాల దగ్గర బస్సులను ఆపాలని కోరారు. విద్యార్థులు పాల్గొన్నారు.

చిగురుమామిడి మండల ఎస్సైగా సాయికృష్ణ



చిగురుమామిడి: చిగురుమామిడి మండల ఎస్సైగా సాయికృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదే పోలీస్ స్టేషన్‌లో ప్రొబేషనరీ ఎస్సైగా పని చేసిన సాయికృష్ణ ఇదే స్టేషన్‌లో తొలి పోస్టింగ్ రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు పని చేసిన సందబోయిన శ్రీనివాస్‌యాదవ్ మూడు నెలలకే ఎస్‌బీకి బదిలీపై వెళ్లడంతో పలువురు విస్మయం వ్యక్తం చేశారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక



వైష్ణవి



రుత్విక



సాత్విక

రామడుగు: రుద్రారం జిల్లాపరిషత్ పాఠశాలలో పదోతరగతి చదివిన విద్యార్థి గోనే వైష్ణవి, రామడుగు జిల్లాపరిషత్ పాఠశాలలో పదోతరగతి చదివి మంచి మార్కులు సాధించిన ఎస్.రుత్విక‌కు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

చిగురుమామిడి: ఇందుర్తి గ్రామానికి చెందిన శ్రీనివాస్-రేణుక దంపతుల కుమార్తె సాత్విక బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. సాత్విక చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాలలో 6 నుంచి పదోతరగతి వరకు చదివింది. పదోతరగతిలో 600 మార్కులకు గాను 566 సాధించింది.

అరచేతిలో.. అందం.. ఆరోగ్యం



- ఆషాఢ మాసంలో అతివల గోరింటాకు సందడి
- సౌభాగ్యం, శ్రేయస్సుకు సంకేతంగా భావిస్తున్న మహిళలు
- మైదాకు పెట్టుకొని మురిసిపోతున్న మగువలు



గోరింటాకు ప్యాకెట్లను కొనుగోలు చేస్తున్న యువతి



హుజూరాబాద్ కంగన్ హాల్ షాపులో విక్రయానికి సిద్ధంగా గోరింటాకు ప్యాకెట్లు

హుజూరాబాద్: ఆషాఢ మాసం వచ్చిందంటే చాలు.. అతివలకు గోరింటాకు గుర్తుకొస్తుంది. ఆషాఢం గడిచేలోగా ఏదో ఒక రోజున గోరింటాకు పెట్టుకొని తీరాలంటూ పెద్దలు చెబుతారు. అతివలకు ఆరోగ్యంతోపాటు ఆధ్యాత్మికాన్ని పెంపొందించే గోరింటాకు సందడి మొదలైంది. ఆషాఢంలో గోరింటాకు పెట్టుకోవడం సౌభాగ్యం, శ్రేయస్సుకు సంకేతంగా భావిస్తారు. గోరింటాకు మహిళల చేతులు, కాళ్లకు కొత్త అందాన్నిస్తుంది. యువతుల చేతులు ఎంత ఎర్రగా పండితే.. అంత మంచి భర్త దొరుకుతాడని విశ్వసిస్తారు. శుభానికి చిహ్నంగా భావిస్తారు.

అనేక ఔషధ గుణాలు

వేసవిలో మన శరీరం వేడితో ఉంటుంది. ఆషాఢంలో బయటి వాతావరణం చల్లబడిపోతుంది. ఆ సమయంలో మన శరీరంలోని వేడి.. బయట వాతావరణానికి విరుద్ధంగా తయారవుతుంది. దీంతో అనారోగ్య సమస్యలు వస్తాయి. అయితే గోరింటాకుకు శరీరంలో వేడిని తగ్గించే శక్తి ఉంటుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. అందుకే ఆషాఢంలో తప్పకుండా పెట్టుకోవాలని డాక్టర్లు కూడా చెబుతున్నారు.

దోషాలను నివారిస్తుంది

గోరింటాకును శుభకార్యాలు, పండుగలప్పుడు పెట్టుకోవడం ఆనవాయితీ. కొన్ని సంప్రదాయాల ప్రకారం గర్భాశయ దోషాలను తొలగిస్తుందని, స్త్రీ ఆరోగ్యాన్ని కాపాడుతుందని నమ్ముతారు. ఆయుర్వేదంలో దాని వేర్లు, బెరడు, ఆకులు, పూలు, విత్తనాలు అన్నీ ఔషధ గుణాలు కలిగి ఉన్నాయని చెబుతారు.

సౌభాగ్యం గుర్తు చేస్తుంది



ఆషాఢంలో కొత్త పెళ్లి కూతుళ్లు తమ పుట్టింటికి చేరుకోవడం ఆనవాయితీ. ఆ సమయంలో తమ చేతుల్లో పండే మైదాకు పంట తమ సౌభాగ్యాన్ని గుర్తు చేస్తుంది. పుట్టింట ఉన్న మనసు మెట్టినింట ఉన్న భర్త ఆరోగ్యాన్ని కాంక్షిస్తుంది.

– మిడిదొడ్డి స్వర్ణలత, తుమ్మనపల్లి

ఆయుర్వేద గుణాలు



ఆయుర్వేదం ప్రకారం గోరింట ఆకులే కాదు.. పూలు, వేర్లు, బెరడు, విత్తనాలు.. అన్నీ ఔషధయుక్తాలే. గోరింట పొడిని మందుగా తీసుకోవడం, గోరింటతో కాచిన నూనెని వాడడం మన పెద్దల వైద్యంలో ఉన్నదే.

– సముద్రాల కిరణాచార్యులు, అర్చకుడు, హుజూరాబాద్

ఆరోగ్యానికి ఎంతో మేలు



గోరింటాకు పెట్టుకోవడంతో అంటు రోగాలు దరి చేరవు. శరీరాన్ని చల్లపరచడానికి సహాయపడుతుంది. జ్వరం, తలనొప్పిని తగ్గిస్తుంది. జుట్టు రాలకుండా సంరక్షిస్తుంది. కేశాల పెరుగుదలకు సహాయపడుతుంది.

– డాక్టర్ శరణ్ సాయికుమార్, వైద్యుడు, హుజూరాబాద్

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న బండి సంజయ్

చొప్పదండి: విద్యతోపాటు విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు ఇటీవల ఉత్తరఖండ్‌లోని హరిద్వార్‌లో జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొని ఏడు బంగారు పతకాలు సాధించగా.. మంత్రి విద్యార్థులను శాలువాలతో సత్కరించారు. పట్టణానికి చెందిన పడకంటి కాశీ విశ్వనాథ్, బూసారపు వెంకటేశ్‌గౌడ్, స్పందన, సౌమ్య, రాంచరణ్‌ను కేంద్ర మంత్రి అభినందించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను ఈనెల 8, 9ల్లో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కోచ్ శ్రీగాద సంతోశ్, బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

రామడుగు: మండల కేంద్రంలోని గౌడ సంఘం భవనం గోడ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని శనివారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను సంఘం ప్రతినిధులు కరీంనగర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు బండ రమణారెడ్డి, మేకల ప్రభాకర్‌యాదవ్, ఒంటెల కరుణాకర్‌రెడ్డి, పూరెల్ల శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

పరామర్శ

ఇల్లందకుంట: భోగంపాడు గ్రామానికి చెందిన బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి తల్లి రాధమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ శనివారం పరామర్శించారు.

జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నాయకులు రఘు, సంపత్‌రావు, బైరెడ్డి రమణారెడ్డి, మల్లేశ్, పల్లపు రవి, కొత్త శ్రీనివాస్, పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అభినందన

వీణవంక: కూచిపుడి నృత్యంలో వరల్డ్ రికార్డు బుక్ సాధించిన చిన్నారులను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మండల కేంద్రంలో అభినందించారు. ఇటీవల గచ్చిబౌలిలో జరిగిన కార్యక్రమంలో వీణవంక గ్రామానికి చెందిన బత్తిని సహస్ర, వేముల సరివిక, కాసర్ల లాస్య నృత్య ప్రదర్శనలో వరల్డ్ రికార్డు బుక్‌లో స్థానం సాధించారు. వీణవంకలో జరిగిన ఓ కార్యక్రమంలో శనివారం సంజయ్ సర్టిఫికెట్ అందించారు. గంగాడి కృష్ణారెడ్డి, ప్రవీణ్‌రావు, బత్తిని నరేశ్‌గౌడ్ తదితరులున్నారు.

జమ్మికుంట: వావిలాల గ్రామంలోని చెరువు మత్తడి నుంచి రైతులు వెళ్లే దారి బ్రిడ్జి నిర్మాణం కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వావిలాల బీజేపీ నాయకుడు కొండ హరీశ్ రైతులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

బస్సు అద్దాలు పగలకొట్టిన ఆకతాయిలు



పగిలిన బస్సు అద్దాలు

శంకరపట్నం: ఏరడపల్లి శివారులో శనివారం రాత్రి ఆకతాయిలు ఆర్టీసీ బస్సు అద్దాలను బండ రాయితో పగలకొట్టడంతో 12 ఏళ్ల లక్షణ్ అనే బాలుడికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ ఆర్డినరీ బస్సు ఏరడపల్లి, అర్కండ్ల మీదుగా వీణవంక మండలం గంగారం, చల్లూర్‌కు శనివారం రాత్రి ప్రయాణికులతో వెళ్తోంది. కరీంనగర్ నుంచి ప్రయాణికులతో బయలుదేరిన ఆర్టీసీ బస్సు ఏరడపల్లి శివారులోకి రాగానే.. ఆకతాయిలు వెనక బస్సు అద్దాలను బండ రాయితో కొట్టారు. బస్సు అద్దాలు పగిలి బస్సులో ప్రయాణిస్తున్న వీణవంక మండలం గంగారం గ్రామానికి చెందిన 12 ఏళ్ల లక్ష్మణ్‌కు గాయాలయ్యాయి. సమాచారమందుకున్న గంగారం, అర్కండ్ల గ్రామస్తులు ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకున్నారు. ఈ సంఘటనపై కేశవపట్నం పోలీసులకు సమాచారమందించారు.



బండ రాయిని చూపిస్తున్న బస్సు డ్రైవర్

త్రుటిలో తప్పిన ప్రమాదం

శంకరపట్నం: తాడికల్ గ్రామ శివారులో శనివారం ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వరంగల్ డిపోకు చెందిన ఎలక్ట్రికల్ బస్సు ప్రయాణికులతో కరీంనగర్ వెళ్తోంది. కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వస్తున్న లారీ తాడికల్ శివారులో వస్ వేలో వస్తూ కరీంనగర్ వెళ్తున్న ఎలక్ట్రికల్ బస్సు కుడి వైపు భాగం ఢీకొట్టేందుకు రావడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన బస్సు డ్రైవర్ పక్కకు తిప్పడంతో ప్రమాదం తప్పింది. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి షాబుద్దీన్

చిగురుమామిడి: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ షాబుద్దీన్ కోరారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో మధుసూదన్ అధ్యక్షత వహించగా.. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, తహసీల్దార్ ఎం.రమేశ్ హాజరయ్యారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్నేహితురాలి కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

హుజూరాబాద్: తమతో చదివిన బాల్య మిత్రురాలు అనారోగ్యంతో అకాల మరణం చెందగా.. ఆమె కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు రూ.2లక్షలు అందించి మానవత్వం చాటుకున్నారు. పట్టణంలోని కాకతీయకాలనీకి చెందిన బుర్ర కవిత గత నెల 11న అనారోగ్యంతో మృతిచెందింది. విశ్వప్రగతి స్కూల్ 1998–99 బ్యాచ్ మిత్రులు క్యాసా కళ్యాణ్, టి.శ్రీనివాస్, రాజు, బుర్ర అశోక్, కాకతీయ జూనియర్ కళాశాల 1999–01 బ్యాచ్ మిత్రులు దోమల శ్రీశైలం, పంజాల సత్యం, సబ్బని గోవర్ధన్, కలిపాక సంజయ్, రాజు, వనిత, స్వప్న, శాతవాహన డిగ్రీ కళాశాల 2001–04 బ్యాచ్ మిత్రులు నర్మద, వెంకటేశ్, చక్రపాణి ఆమె కూతురు సుప్రీతి భవిష్యత్తు, విద్యావసరాల నిమిత్తం రూ.2లక్షల బ్యాంకులో డిపాజిట్ చేశారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

చిగురుమామిడి: కొండాపూర్‌కు చెందిన గూల్ల నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మంచాన పడి మృతిచెందగా.. శనివారం నర్సయ్య భార్య భద్రవ్వ, కుమారులు రాజేశ్, రాకేశ్‌కు వాట్సాప్ గ్రూపు సభ్యులు రూ.40వేలు అందించారు.

నివాళి



తిమ్మాపూర్: రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఓ టీవీ చానల్ జర్నలిస్టుగా విధులు నిర్వహిస్తూ ఆకస్మిక మరణం చెందిన ప్రసాద్ మృతిపై తిమ్మాపూర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నివాళి అర్పించారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బత్తుల రాకేశ్ ఆధ్వర్యంలో సభ్యులు మౌనం పాటించి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా ఈసీ మెంబర్ సిరిసిల్ల అనిల్‌కుమార్, ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు ముస్కు లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు నాగెల్లి ఆంజనేయులు, సహాయ కార్యదర్శి కొంపల్లి సతీశ్, గౌరవ సలహాదారు వేల్పుల రాజు, లంక స్వామి, జాప నాగరాజు, కొమ్మెర రాజిరెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలి

కరీంనగర్‌కల్చరల్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ప్రతీ విద్యార్థి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరేలా వారి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రోత్సహించాలన్నారు. కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వ వసతి గృహాల్లో జూనియర్ కాలేజీ విద్యార్థుల వసతి అంశాన్ని పరిశీలిస్తామన్నారు. ఒకేషనల్ కోర్సులు చదివే విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారికి అవసరమైన మెటీరియల్‌ను జిల్లా యంత్రాంగం నుంచి సమకూరుస్తామని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలు ఉన్నచోట్ల ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ అంశాన్ని అధికారులతో చర్చిస్తామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి వి.గంగాధర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు.



గంగాధర: కరీంనగర్–జగిత్యాల ప్రధాన రోడ్డు మధురానగర్ చౌరస్తా సమీపంలోని మామిడి తోట దగ్గర్లో విద్యుత్ తీగల పక్కన ఎండిపోయిన చెట్టు ప్రమాదకరంగా ఉంది. చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడిపోయే ప్రమాదముంది. తీగలున్నాయని పచ్చని చెట్లను కొట్టేసిన విద్యుత్ శాఖ సిబ్బంది ఎండిపోయిన చెట్టును వదిలేశారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
తిరుపతి, విద్యుత్ ఏఈ, గంగాధర, సెల్ నంబర్: 8712483381

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ఇంటింటా సర్వే చేయాలి



బీఎల్‌వోలకు శిక్షణ ఇస్తున్న ఆర్డీవో రమేశ్‌బాబు తదితరులు

జమ్మికుంట: ఎన్నికల్లో బూత్‌స్థాయి అధికారులు ప్రత్యేక జాగ్రత్తలతో ఇంటింటా సర్వే చేయాలని హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబు అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని అబాది జమ్మికుంట రైతు వేదికలో తహసీల్దార్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లకు ఎలక్టరల్ రోల్ తయారీ, ఫామ్–6, 6ఏ, 7, 8, ఇంటింటి సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాస్, సాయికృష్ణ, సత్యనారాయణ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తగట్టుకు స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం



పాఠశాలలో సభ్యులు

శంకరపట్నం: కొత్తగట్టు గ్రామాన్ని శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సందర్శించింది. గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, మత్స్యగిరీంద్రస్వామి దేవాలయంలో పరిశుభ్రతపై పరిశీలించారు. గ్రామంలో ప్రతీ ఇంటా మరుగుదొడ్లు వాడుతున్నారా, మురుగు నీరు కాలువలోకి వెళ్తుందా, ఇంకుడు గుంతలోకి వెళ్తుందా, ఇంట్లో వాడిన తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌కు అందిస్తున్నారా వంటివి పరిశీలించారు. రాణి, రజిత, కృష్ణప్రసాద్, ప్రభాకర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం



కమిషనర్‌ను సన్మానిస్తున్న ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు

హుజూరాబాద్: పట్టణ మున్సిపల్ పరిధిలో చేసిన సేవా కార్యక్రమలతో రాష్ట్రస్థాయిలో ఉత్తమ కమిషనర్‌గా అభినందనలు అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ సంఘ భవనంలో పట్టణ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యను ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్‌పాషా, కోశాధికారి కె.దుర్గాజీ, ప్రచార కార్యదర్శి గంజి జయవర్ధన్, జిల్లా కౌన్సిలర్లు పి.లక్ష్మీనారాయణ, చింత ఆగయ్య, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు విలాసాగరం వీరాస్వామి, కబడ్డీ సమ్మిరెడ్డి, వెల్పుల రత్నం, మాజీ ఎంఈవో ఆర్.రాజయ్య, గంగిశెట్టి జగదీశ్వర్, కె.వెంకటరెడ్డి, రిటైర్డ్ ఏఈ బొర్గాల మొగిలి, జున్నోతుల రామ్‌రెడ్డి, ఎస్.తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారోబార్ల సంఘం అధ్యక్షుడికి సన్మానం



సన్మానిస్తున్న గ్రామస్తులు

వీణవంక: కారోబార్ల సంఘం మండల అధ్యక్షుడిగా పల్లెర్ల మహేశ్‌గౌడ్ ఇటీవల ఎన్నికవగా.. శనివారం బేతిగల్‌తోపాటు పలు గ్రామాలవాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు. కంబాల రమేశ్, శ్రీనివాస్, రవి, చంద్రశేఖర్, రాకేశ్, చందు, నరేశ్, రవీందర్, సురేశ్ తదితరులున్నారు.

విద్యార్థుల సర్కారు బడిబాట



సర్కారు బడిలో చేరిన విద్యార్థులు

గంగాధర: ఒకప్పుడు విద్యార్థుల్లేక వెలవెలబోయిన ప్రభుత్వ పాఠశాల.. ఉపాధ్యాయుల ప్రయత్నం, గ్రామస్తుల సహకారంతో ఈ విద్యాసంవత్సరం విద్యార్థులతో కళకళలాడుతుంది. కొండాయిపల్లి ప్రభుత్వ పాఠశాలలో గత విద్యాసంవత్సరం 21 మంది విద్యార్థులు మాత్రమే చదివారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి విద్యాశాఖ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమంతో ప్రచారం చేయడంతోపాటు పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై వివరించారు. కొండాయిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంఖ్య 73కు పెరిగింది. విద్యార్థుల సంఖ్య పెరగడంతో పురోగతిని పురస్కరించుకొని విద్యావిశ్వోత్సవం-ప్రతి అడుగు చదువు వైపు అనే ఆలోచనతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్‌రావు అభినందించారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి

కరీంనగర్: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని ఆల్ ట్రేడ్ యూనియన్స్, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఎన్టీఆర్ విగ్రహం నుంచి గీత భవన్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ జిల్లా కార్యదర్శులు టేకుమల్ల సమ్మయ్య, ఎడ్ల రమేశ్, జిందం ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 9న జరిగే సమ్మెలో జిల్లాలో ఒక లక్ష మంది పాల్గొంటున్నారన్నారు. కార్మిక వర్గంలో అపూర్వమైన మద్దతు లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న యాదవ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత



జమ్మికుంట: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి టౌన్ సీఐ రామకృష్ణ శనివారం అందజేశారు. జమ్మికుంట రైల్వే స్టేషన్ వద్ద బెల్లంపల్లికి చెందిన జంజీరాల మనోహర్ అనే వ్యక్తి సెల్‌ఫోన్ పోగొట్టుకొని జమ్మికుంట టౌన్ పోలీస్ స్టేషన్ సీఐని సంప్రదించాడు. ఐఎంఈఐ నంబర్ ద్వారా సీఈఐఆర్ పోర్టల్‌తో మొబైల్‌ను పట్టుకొని అందించారు.